నేటి దినపత్రిక
సూర్య
తూర్పు గోదావరి
కాకినాడ, మేజర్‌న్యూస్
గురువారం,12 ఏప్రిల్ 2018 8పేజీలు

# ఘనంగా జెఎన్‌టియుకెలో పూలే 192వ జయంతి ఉత్సవాలు



కాకినాడ, మేజర్‌న్యూస్ :జెఎన్‌టియుకెలో మహాత్మ జ్యోతిబా పూలే 192వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహాత్మగా కొనియాడబడిన పూలే చిత్రపటానికి జెఎన్‌టియుకె అధికారులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. సభకు ముఖ్యఅతిథిగా రెక్టార్ ప్రొ. కె.పూర్ణానందం విచ్చేశారు. ప్రత్యేక అతిథిగా రిటైర్డ్ ప్రొఫెసర్ డా.కనకారావు పాల్గొనగా రిజిస్ట్రార్ ప్రొ.వి.వి.సుబ్బారావు సభకు అధ్యక్షత వహించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం మాట్లాడుతూ అంబేద్కర్ వంటి గొప్ప వ్యక్తే జ్యోతిరావు పూలే నుంచి స్ఫూర్తి పొందారని, పూలే ముఖ్యంగా కుల రహిత సమాజం, మహిళా సాధికారత, సమానత్వం మొదలగు అంశాలపై పోరాడారన్నారు. పూలే గారు గౌతమ బుద్ధ, భక్త తుకారాం, కబీర్‌దాస్, థామస్ పైరే, అబ్రహం లింకన్, బెంజిమెన్ ఫ్రాంక్లిన్ మొదలగు వారి వలన స్ఫూర్తి పొంది మొట్టమొదటిగా భారతదేశంలో మహారాష్ట్రలోని సంతారా జిల్లాలో ఆడపిల్లలకు పాఠశాలను ప్రారంభించారన్నారు. ఈ పాఠశాలలో ఆయన భార్య శ్రీమతి సావిత్రీబాయి పూలే తొలి ఉపాధ్యాయినిగా పనిచేసి విద్యార్థినులకు తమ జీవితాలను అందంగా మలచుకునేలా ఆలంబన కల్పించారు. అలాగే 1850లో మొట్టమొదటి అనాథాశ్రమాన్ని స్థాపించి ధర్మసంస్థాపనకు కృషి చేశారని తెలిపారు. పూలే ఒక గొప్ప రచయిత అని, సత్య సంశోధకుడని, ఈయన గ్రామాభివృద్ధికై చాలా పాటుపడ్డారన్నారు. దళితులకు చేయూతనిచ్చి గ్రామాలలో ప్రాథమిక విద్యకై పాఠశాలను నెలకొల్పి వారికి ఉపకార వేతనాలు ఇచ్చేలా కృషి చేశారు. ప్రత్యేక అతిథి డా.కనకారావు మాట్లాడుతూ విద్యార్థులకు తెలియజేసేలా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించాలని, రిజర్వేషన్లు సరిగా అమలు కాని తెగలకు విషయ పరిజ్ఞానం కల్పించి అట్టడుగు వర్గాలను అభివృద్ధిపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జ్యోతిరావు పూలే యొక్క ఆదర్శాలను అవలంభించేలా భావితరాలకు దారి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి ప్రొ.కెవి .రమణ, డైరెక్టర్‌లు, ప్రోగ్రాం డైరెక్టర్‌లు, వైస్ ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, అధ్యాపకులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.